# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM

మంగళవారం
19 08 2025

సంపుటి 1 సంచిక 111

పేజీలు : 02

UDYAM / TS-09-0148996


## చరిత్రలో ఈ రోజు





0014: ఆగస్టస్, రోమన్ చక్రవర్తి మరణం (జ.63 బి.సి). ఇతని పేరున, ఆగష్టు నెల ఏర్పడింది.

1839: ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం

1918: భారతదేశ తొమ్మిదవ రాష్ట్రపతి శంకర దయాళ్ శర్మ జననం (మ.1999).

1919: ఆఫ్ఘనిస్తాన్ పూర్వ బ్రిటిష్ ప్రభుత్వం నుండి స్వాతంత్ర్యం పొందినది.

1925: తెలుగు సినిమా నిర్మాత, నటుడు అట్లూరి పుండరీకాక్షయ్య జననం

1946: అమెరికా 42వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ జననం.

2016: రియో ఒలింపిక్స్ నందు ఒలింపిక్ పోటీల్లో రజత పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా పి.వి. సింధు రికార్డు సృష్టించింది. (చిత్రంలో)

## రాహుల్ సిప్లిగంజ్ - హరణ్య రెడ్డిల నిశ్చితార్థం



**దశ, హైద్రాబాద్:** ఆస్కార్ విన్నర్ రాహుల్ సిప్లిగంజ్ హరణ్య రెడ్డిల నిశ్చితార్థం ఘనంగా నిర్వహించారు. అధికారికంగా నిశ్చితార్థం వివరాలు ప్రకటిస్తూ తన ఎక్స్ హ్యాండిల్ లో ఫోటోలు పోస్ట్ చేసారు. ఆస్కార్ అవార్డు పొందిన సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తో మా అన్న కూతురు హరణ్యా రెడ్డి నిశ్చితార్థం హైదరాబాదులోని ఐ టీ సి కోహినూర్ లో ఘనంగా జరిగింది. పెద్దలు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఎంగేజ్మెంట్ జరగడం సంతోషంగా ఉంది" అని పేర్కొంటూ శ్రీనివాసులు రెడ్డి సోషల్ మీడియాలో నిశ్చితార్థానికి సంబంధించిన ఫోటోలు షేర్ చేశాడు.

## 23తర్వాత ఎన్నికల నోటిఫికేషన్..?




**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నేడు ఉదయం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సందిగ్ధత, ఎన్నికల నిర్వహణకు సంబంధించి విధించిన గడువుపై చర్చించారు. సెప్టెంబర్ చివరికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు విధించిన గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించనున్నారనే దానిపై ఓ క్లారిటీ వచ్చేందుకు కీలకంగా భావిస్తున్న PAC సమావేశం తేదీ ఖరారుపై ఇరువురూ చర్చించినట్లు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా తేలకపోవడంతో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ అంశాలపై చర్చించేందుకు పీఏసీ సమావేశం ఈ నెల 23న సాయంత్రం 5 గంటలకు గాంధీ భవన్‌లో జరగనుంది.



## సమాజంలో ఎదగాలన్నా, నిలదొక్కుకోవాలన్నా

# చదువు ఒక్కటే మార్గం

సమాజంలో ఎదగాలన్నా, నిలదొక్కుకోవాలన్నా చదువు ఒక్కటే మార్గం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375 వ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

సినిమా రంగానికి ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతను అందిస్తాం : సీఎం

**దశ, హైద్రాబాద్:** బహుజనులు సమాజంలో ఎదగాలన్నా, నిలదొక్కుకోవాలన్నా చదువు ఒక్కటే మార్గమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. బహుజనులు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లల కోసం రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

హైదరాబాద్ రవీంద్రభారతిలో శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ గారి 375వ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ఆ మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు, సలహాదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వివరాల ఆధారంగానే బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం, విద్య ఉద్యోగావకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రిమండలి తీర్మానించి శాసనసభలో సమగ్ర చర్చ చేసి ఆమోదించిన రెండు బిల్లులను గవర్నర్ గారికి పంపించాం. అలాగే స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటడానికి వీలులేకుండా గత ప్రభుత్వం చేసిన పంచాయతీ రాజ్ చట్టం అడ్డంకిగా మారడంతో ఆ గరిష్ట పరిమితిని తొలగిస్తూ ఆర్డినెన్స్ జారీ చేశాం.

ఆ మూడింటినీ గవర్నర్ గారు రాష్ట్రపతి కి పంపించారు. వాటిని ఆమోదించాల్సిన అవసరం ఉంది. గడిచిన అయిదు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. వాటిని ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి యావత్ మంత్రిమండలి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా సంఘాల ప్రతినిధులందరం ఢిల్లీలో ఆందోళన చేశాం. కుల గణన లెక్కల్లో ఎక్కడా ఒక్క తప్పు లేదు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 95 వేల మంది ఎన్యుమరేటర్లు 60 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి సమాచారాన్ని సేకరించారు. ఆ సమాచారాన్ని సంపూర్ణంగా కంప్యూటర్ లో క్రోడీకరించామన్నారు . ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి,



..మిగతా 2వ పేజీలో →

## పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు హర్షణీయం: కలెక్టర్ నారాయణ రెడ్డి

**దశ, రంగారెడ్డి:** ట్యాంక్ బండ్ పై రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుండటం హర్షనీయమని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా కలెక్టరేట్లోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాపన్నగౌడ్ గౌడ కులవృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తూ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత బహుజన మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ ఓ సంగీత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశూరాం, బీసీ ఫ్రంట్ నాయకుడు, మల్లేష్ యాదవ్, సుధాకర్ గౌడ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

**దశ, రంగారెడ్డి:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలోనిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (70) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా.అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విజయవాడ-హైదరాబాద్ మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్

**దశ, నల్గొండ:** విజయవాడహైదరాబాద్ నేషనల్ హైవే 65 పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పండుగలు, వీకెండ్ సెలవులు, భారీ వర్షాలు వల్ల నగరవాసులు టూర్లకు వెళ్లడంతో తిరిగి నగరానికి వచ్చే వాహనాలతో ఒక్కసారిగా రద్దీ ఏర్పడింది. అదనంగా నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కూడా ట్రాఫిక్ జామ్కి కారణం. పెద్దకాపర్తి నుంచి చిట్యాల వరకు వాహనాలు గంటల తరబడి నిలిచిపోగా, పోలీసులు ట్రాఫిక్ను క్రమబద్ధీకరిస్తున్నారు.



## తొర్రూరులో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం

పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

**దశ, తుర్కయంజాల్ :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూరు గ్రామంలో ఆధ్యాత్మిక శోభతో బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠ మహోత్సవం, ఎల్లమ్మ దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. తమ సొంత గ్రామంలో జరుగుతున్న ఈ వేడుకలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డి , గౌరవ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై, శాస్త్రోక్త పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితులు ప్రత్యేకంగా సిద్ధం చేసిన బొడ్రాయికి మంత్రోచ్చారణల మధ్య వివిధ పూజలు నిర్వహించి, ఊరి నడిబొడ్డున ప్రతిష్ఠించారు. శాస్త్రోక్త విధానంలో జరిగిన ఈ ప్రతిష్ఠకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఎల్లమ్మ దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ విశేషంగా ఆకట్టుకుంది. పంచవాద్య నినాదాలు, యజ్ఞ యాగాలు, హారతులతో నిర్వహించిన ఈ మహోత్సవం భక్తి పరవశాన్ని కలిగించింది. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. “ఇలాంటి ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలు గ్రామాల ఐక్యతకు ప్రతీక. ఇవి ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించి, సాంప్రదాయ విలువలను కాపాడటానికి దోహదం చేస్తాయి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బొడ్రాయి మరియు ధ్వజస్తంభ ప్రతిష్ఠలు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ మహోత్సవంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీకృష్ణ శోభాయాత్రలో అపశృతి...

### రథం లాగుతుంటే తగిలిన విద్యుత్ తీగలు.. ఆరుగురు మృతి..

దశ, మేడ్చల్: హైదరాబాద్‌లోని రామంతాపూర్ ఏరియా గోకులనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా నిర్వహించిన రథయాత్రలో అపశృతి చోటుచేసుకుంది. ఊరేగింపు చేస్తున్న రథం విద్యుత్ తీగలకు తాకడంతో ఒక్కసారిగా కరెంట్ షాక్ వచ్చింది. ఈ ఘటనలో ఐదుగురు భక్తులు కృష్ణయాదవ్ (21), రాజేంద్రరెడ్డి (45), సురేశ్ యాదవ్ (34), రుద్రవికాస్ (39), శ్రీకాంత్‌రెడ్డి (35) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గణేష్ అనే వ్యక్తి చనిపోవడంతో షార్ట్ సర్క్యూట్ తో మృతిచెందిన వారి సంఖ్య ఆరుకు చేరింది.

### బాధితులకు అండగా ఉంటామన్న ప్రభుత్వం.

కరెంట్ షాక్ కొట్టి చనిపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతుల సంఖ్య ఆరుకు చేరుకుంది. రథానికి కరెంట్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో చనిపోయిన వారి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. రామాంతాపూర్ ఘటనలో మృతుల కుటుంబాలను మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. సోమవారం మధ్యాహ్నం గాంధీ ఆసుపత్రికి వెళ్లిన శ్రీధర్ బాబు మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబాలకు అండగా ఉంటుందని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.



## యూరియాను వెంటనే విడుదల చేయాలని ఎంపిల నిరసన

**దశ, న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన 3.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు పార్లమెంట్ హౌస్ బైట తెలంగాణ రాష్ట్ర ఎంపీలు పోరిక బలరాం నాయక్ , మల్లు రవి ,చామల కిరణ్ కుమార్ రెడ్డి ,గడ్డం వంశీ కృష్ణ నిరసన తెలియచేసారు. అనంతరం ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రైతులకు యూరియా కొరతపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది అని అన్నారు.స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే కేంద్రమంత్రి జేపీ నడ్డా ని కలిసి విన్నవించినా, యూరియా కొరతను తీర్చలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన 3.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, రేపు పార్లమెంట్లో వాయిదా తీర్మానం ఇవ్వడంతో పాటు, మకర్ ద్వార్ వద్ద నిరసన తెలపనున్నాము అని తెలిపారు.

## తిరుమలగిరిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**దశ, తిరుమలగిరి:** తెలంగాణ తొలి రాజు, బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు, మొఘలాయిల దౌర్జన్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటను పాలించిన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375వ జయంతి వేడుకలు ఈరోజు తిరుమలగిరి మున్సిపాలిటీలో తెలంగాణ ఉద్యమ వర్గాల నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నాయకులు జలగం రామచంద్రన్ గౌడ్, జలగం వేణు గౌడ్, గిలకత్తుల రాము గౌడ్, కొంపెల్లి రామ్మూర్తి గౌడ్, గిలకత్తుల కొమురెల్లి గౌడ్, లోడే సాయి గౌడ్, దుబ్బాక అశోక్ గౌడ్, కందుకూరి ప్రవీణ్ కుమార్, కడిమ లింగయ్య, గిలకత్తుల సంపత్ గౌడ్, రాకేష్ గౌడ్, మొగుళ్ళగిరి సతీష్ గౌడ్, కారుపోతుల శ్రీనివాస్ గౌడ్, శ్రవణ్ కుమార్ గౌడ్, అనిల్ గౌడ్, ఉపేందర్ గౌడ్, అంబటి మహేష్ గౌడ్, నాతి రమేష్ గౌడ్, నాతి వీరమల్లు గౌడ్, మొడెపు వీరన్న గౌడ్ తదితరులు హాజరయ్యారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

❖ *గణేష్ ఉత్సవాలు నిర్వాహణ పై భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ వారితో సమన్వయ సమావేశం*

❖ *పాల్గొన్న రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు*



**దశ, రంగారెడ్డి :** ప్రశాంతవాతావరణంలోగణేష్ ఉత్సవాలు నిర్వహించాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. సోమవారం రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ సుధీర్ బాబు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి జిల్లాలకు సంబంధించి గణేష్ ఉత్సవాలు నిర్వాహణ పై అదనపు కలెక్టర్లు, డిసిపిలు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, వాటర్ వర్క్స్, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ నెల 27వ తేది నుండి సెప్టెంబర్ 6వ తేది వరకు నిర్వహించే గణేష్ ఉత్సవాలు ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. మండపాల ఏర్పాటు నిబంధనలకు లోబడి ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపాల వద్ద ఎటువంటి విద్యుత్, అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం చేసే సమయంలో చెరువుల వద్ద లైటింగ్, క్రేన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, శానిటేషన్ చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడటం జరుగుతుంది అని తెలిపారు.

పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుండి పాల్గొన్న ఇంచార్జి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గణేష్ ఉత్సవాలు శాంతి భద్రతల మధ్య శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భువనగిరి అదనపు కలెక్టర్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, విద్యుత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్ అండ్ బి, వాటర్ వర్క్స్, పోలీసు అధికారులు, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలో ఉద్యమకారులకు అన్యాయం




**దశ, సూర్యాపేట ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని భావిస్తే చివరికి అన్యాయమే జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర మహిళా వింగ్ అధ్యక్షురాలు కోతి మాధవి రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రైతు మార్కెట్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సెప్టెంబర్ 12న ఇందిరా పార్కు వద్ద జరిగే టి యు జెఏసి మహాధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టి యు జెఏసి రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి మురళి, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర నాయకులు మల్లయ్య యాదవ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు వీరబోయిన రవి యాదవ్, మల్లయ్య యాదవ్, సంతోష, కమలమ్మ, గణేష్, రాజు, సుధాకర్, చంద్ర రామ్మూర్తి, శ్రీనివాస్, రాఘవులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయం



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు (జెడ్పి ఎంపీ హై స్కూల్) ముందుకు రావడం అభినందనీయమని డి ఐ ఈ ఓ బాలు నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల పటేల్ దీపిక ప్రాంగణంలో జడ్పీ ఎంపీ హై స్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వాతంత్రదినోత్సవాన్నిపురస్కరించుకొని ఉగ్రవాదం ఆపరేషన్ సింధూరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో కళాశాల ఆర్చి నిర్మాణానికి పూర్వ విద్యార్థుల జ్ఞాపకార్థం పాత కళాశాల భవన ఫోటో గ్యాలరీ ఏర్పాటు కు ముందుకు రావడం హర్షినియమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సూర్యనారాయణ, ప్రొఫెసర్ వి విశ్వ మోహన, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఉప్పు నూతలమహేందర్ రెడ్డి, మాజీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పటేల్ నరసింహారెడ్డి, డాక్టర్ విద్యాసాగర్ రుద్రంగి సత్యనారాయణ, సుధా బ్యాంకు ఎండి పెద్దిరెడ్డి గణేష్, కే రామదాస్, కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ళ యాదయ్య, వలిశెట్టి సత్యనారాయణ, తాటి చంద్రశేఖర్, వేణుధర్ పాల్గొన్నారు.




## అక్రమ రవాణా అరికట్టడంపై అవగాహన సదస్సు

**దశ, హుజురాబాద్:** పట్టణంలో జరుగుతున్న మానవ అక్రమ రవాణాపై హుజూరాబాద్‌లోని కాకతీయ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్చార్జి ఎస్ఐ సురేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేందర్ మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ రవాణా చేసే పద్ధతులు, సెక్సువల్ వేధింపులు, పిల్లలతో భిక్షాటన, బాలకార్మికులు, అవయవాల దోపిడీ, బాల్య వివాహాలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు ఆయన సవివరంగా తెలియజేశారు.ఈ అవగాహన సదస్సులో కాకతీయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రెడ్డి, అలాగే సిబ్బంది ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఎం ఎస్ కే ప్రసాద్ క్రికెట్ అకాడమీని ప్రారంభించిన కొప్పుల వేణారెడ్డి



**దశ సూర్యాపేట ప్రతినిధి:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్, భారత క్రికెట్ జట్టు మాజీ సభ్యుడు ఎం ఎస్ కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎం ఎస్ కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి క్రికెట్ కోచింగ్ లో రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని అన్నారు.

## కూకట్‌పల్లిలో 12 ఏళ్ల బాలిక దారుణ హత్య

**దశ, హైదరాబద్:** హైదరాబద్ నగరంలో దారుణం చోటు చేసుకుంది. కూకట్‌పల్లి ప్రాంతంలో ఒంటరిగా ఉన్న ఓ 12 ఏళ్ల బాలికను దుండగులు దారుణంగా హత్య చేశారు. వివరాలోకి వెళితే బాలిక తల్లిదండ్రులు పని కోసం బయటకు వెళ్లారు. ఇదే అదనుగా చూసి బాలిక సహస్రినిని హత్య చేశారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తండ్రినే బాలికను హత్య గురించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టిం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని సూర్యాపేట జిల్లా సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పులుసు వెంకన్న, సాంస్కృత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గిలకత్తుల రమేష్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలంపల్లి వినయ్ గౌడ్ లు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండు సమీపంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 375 వ జయంతి ఘనంగా నిర్వహించినందుకు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వెంకన్న గౌడ్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు గిల కత్తుల నాగమణి గౌడ్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి అనంతుల నవ్య గౌడ్, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి నకిరేకంటి చిరంజీవి, ఉద్యమ కళాకారుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కోట వీరస్వామి, పాముల కృష్ణ, లింగన్న, సువర్ణ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.




## చెల్పూర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**దశ, హుజూరాబాద్:** హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా, ఆయన పీహెచ్‌సీలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, వైద్యసిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. డాక్టర్ వెంకటరమణ ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలు, మందుల లభ్యత, పరిశుభ్రత వంటి అంశాలను కూడా పరిశీలించారు.ఈ ఆకస్మిక తనిఖీలో ఆయన వెంట హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, పీహెచ్‌సీ డాక్టర్ మధు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్ఈఓ) విజయేందర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యం, ఇతర సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. వైద్య సేవలను మెరుగుపరచడానికి అవసరమైన మార్గదర్శకాలను ఆయన అక్కడి సిబ్బందికి అందించారు.

## మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం




దశ, హుజురాబాద్: హుజూరాబాద్ పట్టణ పరిధిలోని కేసీ క్యాంపులో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కేంద్రంలో మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. బి.ఎన్.రావు హెల్త్ ట్రస్ట్ సౌజన్యంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ బి.ఎన్.రావు మాట్లాడుతూ బి.ఎన్.రావు హెల్త్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, నిరుద్యోగ యువతకు పుస్తకాల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ, కుట్టు శిక్షణ వంటి నైపుణ్య ఆధారిత కార్యక్రమాలు మహిళల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, మేనేజర్ ఆదాం, సుదర్శన్, శిక్షకురాలు సబితతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు

## సమాజంలో ఎదగాలన్నా, నిలదొక్కుకోవాలన్నా చదువు ఒక్కటే మార్గం

మొదటి పేజీ తరువాయి

అడ్లూరి లక్ష్మణ్ కుమార, సలహాదారులు కే. కేశవరావు గారు, వేం నరేందర్ రెడ్డి గారు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నగర మేయర్ గారు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



**శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన**

హైదరాబాద్ ట్యాంక్‌బండ్ పైన తొలి తెలుగు బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు , జూపల్లి కృష్ణారావు , పొన్నం ప్రభాకర్ , వాకిటి శ్రీహరి , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నగర మేయర్ గారితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సినిమా రంగానికి ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతను అందిస్తాం . భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్ హైదరాబాద్ నగరాన్ని నిలుపాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సినిమా రంగానికి ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతను అందిస్తామని తెలిపారు. 71 వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఎంపికైన సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి గారిని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అవార్డు గ్రహీతలైన భగవంత్ కేసరి సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి , హనుమాన్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ , హనుమాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్‌కు సంబంధించి వెంకట్ , శ్రీనివాస్ , టీమ్ సభ్యులు, ఫైట్ మాస్టర్స్ నందు , పృథ్వీ , బేబి సినిమా డైరెక్టర్ సాయి రాజేశ్ , సింగర్ రోహిత్ లను ముఖ్యమంత్రి సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి , నిరంజన్ రెడ్డి , బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్ , భగవంత్ కేసరి , నిర్మాత గారపాటి సాహు తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## మహిళా హక్కులు, రైతుల సమస్యలపై తెలంగాణ జాగృతి రాజీలేని పోరాటం

❖ *జిల్లా అధ్యక్షురాలు సూరరపు కృష్ణవేణి*



**దశ సూర్యాపేట, ప్రతినిధి :** రెండు దశాబ్దాలుగా తెలంగాణ సంస్కృతి పరిరక్షణలో ఉన్న తెలంగాణ జాగృతి మహిళా హక్కులు రైతుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందని తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు సూరారపు కృష్ణవేణి అన్నారు. తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షరాలుగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా సూర్యాపేట పట్టణానికి విచ్చేసి పట్టణంలోని మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలో ఏ పార్టీ ఉన్న తెలంగాణ జాగృతి ప్రశ్నించడం మానుకోలేదని నాడు మహిళా బిల్లు కోసం నేడు బీసీ బిల్లు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తిరుగులేని పోరాటం నిర్వహిస్తుందన్నారు. తనను జిల్లా అధ్యక్షురాలుగా నియమించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, నాతాల సైదిరెడ్డి, ఉమారాణి, సాయి గౌడ్, మాధవి సైదిరెడ్డి, సంజీవ్ నాయక్, నకిరేకంటి చిరంజీవి, పుల్లూరి అఖిల్, అభి, నరేందర్, వాడపల్లి కార్తీక్, కొండేటి అఖిల్ తదితరులు ఉన్నారు.